కథా నిలయం శ్రీకాకుళం

# గుక్కెడు పాలు

పాలు:... పాలు:... పాలుకావాలి బాబుకి! అలాగా, పాలుకావాలండీ తమరికి ! మామూలు పాలొద్దు. డబ్బాపాలు కావాలా- మా నాయనే. డబ్బాపాలెక్కడ దొరుకుతాయి చిట్టితండ్రీ. డబ్బాలోవుంటాయి. డబ్బా లెక్కడవుంటాయిబాబూ? బజార్లో దొరుకుతాయి. మరి ఆ డబ్బాఎలావస్తుందినాన్నా... డబ్బిచ్చి కొంటే వస్తుంది. డబ్బెక్కనించి వస్తుందిరా బాబూ! అడ్డగాడిదా, చెవలాయి, డబ్బెక్కడ నించి వస్తుంది అనే వెధవ్వి పిల్లాడినెందుకు కన్నావోయి, కన్న వెధవ్వి ఏ మనిషిపాలో, ఆవుపాలో, గేదెపాలో, నీళ్ళపాలో అలవాటు చెయ్యక డబ్బాపాలెందుకు అలవాటు చేశావురా చిట్టితండ్రీ... నీ పెళ్ళాం చేసిందా - చేస్తుంది. చేస్తుంది. డబ్బాతెండి పిల్లాడికి అనగానే వెర్రివెంగళాయిలా తలాడించి డబ్బప్పుచేసి మరీ కొనివుంటావు. ఆ... అదే తప్పుగాదూ! అలివేణీ, ఆణిముత్యమా నా మొదటి తప్పు ఉద్యోగం లేకుండా బామ్మ చావుమంచంలోవుండి బలవంతం చేసిందని నిన్ను పెళ్ళాడడం... అడితినిబో, బుద్ధిలేక పిల్లాడిని కనడం, ఈ రెండుతప్పులకి శిక్షగా డబ్బా లెక్కడతేను, గంజిపట్టు, బార్లీ పట్టు, నూకలజావపట్టు. మరేం చచ్చిపోడు.

యివి తాగినపిల్లలు దబ్బపళ్ళల్లావున్నారు. అని నచ్చచెప్పి నమ్మించావా, లేదు. ఎందుకు చెప్పలేదు. నీవేం లక్షాధికారిననుకున్నావా. ఏ పెద్ద ఆఫీసరుననుకున్నావా. అష్టరాల్. గుమస్తావన్నాకాదే. ఉద్యోగం సద్యోగంలేని వెధవ్వి. ఏ ధైర్యంతో పాలడబ్బాలు అలవాటు చేశావు. డబ్బాపాతిక ముప్పై పెట్టి నెలకి మూడునాలుగు ఎలాకొందామనుకున్నావు. ఛా నాదగ్గిరేడవకు. పాలమ్మి డబ్బివ్వలేదని తిడ్తూ పోసే ఆ నీళ్ళ పాలూ మానేసిందా. పిల్లాడికి జ్వరం ఏడు రోజులబట్టి పాలడబ్బాలేదా! అన్నంగంజి పెడితే నోట పెట్టడం లేదు. పెట్టినా

వాంతి చేస్తున్నాడు. వాంతి చేయకపోయినా ఆరగక విరేచనాలతో కళ్ళు తేలేశాడు. నాదగ్గరేడిస్తే ఏంలాభం. ఏ డాక్టరు కాళ్ళోపట్టుకో. పట్టుకుంటే పిల్లాడికి మందు పాలడబ్బా తెమ్మన్నాడా?

అంటాడంటాడు... వాళ్ళూదుకాణం వాళ్ళూ ఒకటే. అమూల్ పట్టండి, గ్లాస్కో పట్టండి అంటారుగాని గంజిపట్టండిఅనరు. అవునా? తెలుసు గదా. మరి ముందెందుకు అలవాటు చెయ్యలేదు మరి. తూరుపుతిరిగి దండం పెట్టాలి. నాలాంటి వాడిని పట్టుకునిఏడిస్తే లాభం ఏమిటి రానాయనా జోగిజోగిరాసుకుంటే బూడిదవు ద్తుంది. ఒరేయ్ సుబ్బారావు... ఏమిటిరా ఆపరుగు. ఎక్కడికిరా ఆపరుగు. ఆ దుకాణం ముందు కారుదిగినవాడు నీ ఫ్రెండా సర్లేవెళ్ళు, ట్రై యువర్ లక్, పదో •పరకో పారేస్తాడేమో అడిగిచూడు...

అరే.. సుబ్బారావా.. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి కన్పించావురా! ఎప్పుడో ఇంటరు చదివే రోజుల్లో యిద్దరం హాస్టల్లో ఒకేగదిలో వుండే వాళ్ళం. ఏమిట్రాయిలా తయారయ్యావు. ఆ అవతారమేమిటి. ఆ బట్టలేమిటి ఏం చేస్తున్నావు.

ఇంకా ఉద్యోగంకోసం తిరుగుతున్నావా! ఇంకా ఉద్యోగంలేకపోవడం ఏమిటిరా? సరేలే ఆఏడుపుమొహం ఏమిట్రా. ఏమిటీ నీపిల్లాడికి వంట్లో బాగో లేదూ.. వ్వాట్ – నీకు పెళ్ళాం, ఓ పిల్లాడుకూడానా! వుద్యోగంలేనివెధవ్వి పెళ్ళెందుకు చేసుకున్నావురా. సర్లే.. సర్లే... ఏడవకు పిల్లాడికి పాలడబ్బా కావాలా! డబ్బుకావాలా. సర్లేవోయ్ పాతిక రూపాయలప్పుకోసం అంత ఏడుపు ఎందుకురా నాయనా. పద, ముందసలు కారెక్కునీవు. యిన్నాళ్ళకి కల్సుకున్నాంమనం కాస్త మాట్లాడుకుందాం. వెడుదువుగానిరావోయి అప్త మిత్రుడివిన్నాళ్ళకు కన్పించావు. లెటజ్ సెలిబ్రేట్. డబ్బునేనిస్తా, పాలడబ్బా కొన్నాక కారులో డ్రాపుచేస్తా! ఊ కారెక్కు....

''హాయ్... హాయ్.. ఈ చల్లని బారులో చల్లనివిస్కీ! గొంతులోకి దిగుతూంటేస్వర్గంబెత్తెడు దూరంలో వున్నట్టులేదురా! ఏమిట్రా ఆవుదం తాగినట్టు ఆ మొహం నీవూనో. ఎంజాయ్ మై బాయ్! ఎంజాయ్! లైఫ్ఈజ్ షార్ట్, లెటజ్ ఎంజాయ్ ఫరెవైల్. ఏరా మనకాలేజీ రోజులు మర్చిపోయావురా, నీవొట్టిపుస్తకాల పురుగులా దూరిచదివి యింటర్‌లో ఫస్టుక్లాసు తెచ్చుకుని ఏం వుద్ధరించావురా. పెద్దచదువులకి డబ్బులేక బి.ఏ. లో చేరి బియ్యేతో ఆపుచేశావా! టట్! ఆదేరా బాడ్‌లక్. చదువుక్కోవాలంటే డబ్బులేక నీవు మానేశావు డబ్బుండి చదువంటక నేను మానేశాను. ఆహా గాడ్ ఈజ్ గ్రేట్.

నేనేంచేస్తున్నానా! ఏదో ఎందుకురాచేయడం మా ఫాదర్ బిజినెస్... దాచిన లక్షలు చూసుకుంటున్నాను. మాఫాదర్ ఆయనలక్షలుచాలక మరోయిన్ని లక్షలు తెచ్చిన అమ్మాయిని తెచ్చి పెళ్ళిచేశాడురా. లక్షల ముందు అందం ఎందుకురా అన్నాడు. మావైఫ్ అంటే నా భార్య పాపం డబ్బు తెచ్చాననన్న గర్వంతో భర్తని కొనగల ననుకుంది. బట్ వీడా ఆడదానికి లొంగేది! ఆడదాని కొంగు పట్టుకుని తిరగే దద్దమ్మనా నేను! దాని మొహం చూడాలంటే చిరాకు. అందంలేకపోతే బుద్ధన్నా ఏడిసిందా? లేదు. ఫలితం ఇంట్లో దొరకని ఆనందాన్ని డబ్బిచ్చిపైనకొనుక్కుంటాం పెళ్ళాలు అన్నవాళ్ళు యింట్లో పడుండడానికి. పిల్లల్ని కనడానికి. యిల్లుచూడడాని కేరా నా సంగతి తెల్సుగదా అనుభవించడానికేబతకాలంటాను.

ఒరేయ్! ఆ హాస్టలురోజులు ఎంత బాగుండేవిరా చీకుచింతా లేకుండా ఎంత ఎన్‌జాయ్‌చేసే వాళ్ళం. ఒరేయ్ సునీత, రాధారాణి వాళ్ళెక్కడున్నారో, ఎక్కడుంటారు? ఏమొగుడిపక్కనో వుండి పిల్లల్నికంటూవుంటారు. ఒరేయ్ ఏమి టిరా ఆమొహం! బార్లోకూచుని ఫ్రీగాపోసినా తాగడానికి ఆ ఏడుపేమిటిరా? తాగరా వెధవా. బీరుకావాలనకుండా పాలడబ్బాఅంటావేమిటిరా ఆ పాలడబ్బాసంగతి ఓ అరగంట మర్చిపోరా చిట్టితండ్రీ డబ్బిస్తాననన్నాగదరా! ఊ, కమాన్ ఒరేయ్ ఆరోజు ల్లోనీవు ఎంతచలకీగా వుండే వాడివిరా, అలాయిద్దరం బీచిఒడ్డున కూర్చుంటే నీవు పాటలు పాడేవాడివి. ఏమిట్రా ఆపాట ఒరేయ్ ఆపాట ఒకసారి పాడరా. పాటలాగేవుంది నా బ్రతుకు అంటావేమిట్రా. ఒరేయ్ బతుకువునల్ని నడిపించకూడదురా, మనం బతుకుని నడిపించాలిరా. ఆ డబ్బుంది గనక నీతులు బోధిస్తున్నా నంటావా. డబ్బు లేక పోతే అది వచ్చేమార్గం చూడాలిరా. ఏడుస్తే వస్తుందా? రాదు. దాని కేంగాని మైడియర్ ఫ్రెండ్ చాలా రోజుల తరువాత కలిశాం. చాలా ఆనందంగా వుందిరా నాకు. ఏమిట్రా తెప్పించింది. తినవా, ఊహు తినాల్సిందే. నీకుజింజర్ చికెన్ యిష్టమన్నది నాకు గుర్తుంది. చూవానీకోసం ఆర్డరువేస్తే వద్దంటావేం. అబ్బ యింకా ఎనిమిదిన్నరే అయిందిబాబూ, వెడుదువుగానిలేరా వెధవ పాలడబ్బా అంటూ ప్రాణాలుతీసిమూడ్ పాడుచేస్తున్నావు.

సరే అదితిని తగలడు వెడదాం దర్టీఫెలో నిన్ను పిలవడం నాతప్పురా. యింకో సారి వసావా. వెధవ్వి యింకోసారి నిన్ను పిలవనసలు, లైఫ్ ఎంజాయ్ చేయలేని వెధవ్వి నీవుబారుకొచ్చినా పిల్లాడు, ఆడలి, ఏడుపు, విరేచనాలు అనే వెధవ్వి నీవేం ప్రాస్పర్ అవుతావురాలైఫ్‌లో. ఆ తెలుసులేవోయ్ నీ పరిస్థితి. పద, నామూడ్ అంతా పోయిందినీతో నీ 'సారి ' లెందుకులేనాకు. ఊ పద కారెక్కు. ఎటు వెళ్ళాలో చెప్పు.

వెరీ సారీరా సుబ్బారావు. వెధవలుతొమ్మిదిన్నరకే షాపులు కట్టేస్తారు. ఇలాంటి వెధవలు ఏం బిజినెస్సు చేస్తారు. పోనీయింకో షాపు కెడదాం ఏడవకు. అరే, యిదీ కట్టేశారు. మీ వీధిలో ఇంకోషాపుంది అది చాలా సేపుంటుందా, అయితే యిదిగో యీవందా తీసుకో, ఆటోలో వెళ్ళిరా యింక డ్రైవ్ చేయలేను నేను, బై. గుడ్‌బై.

''ఏమండీ, సాయంత్రం నాలుగున్నరకిపోయిన వాళ్ళు యిప్పుడా రావడం – పాలడబ్బాతెస్తానని వెళ్ళి పదిగంటలకి యింటికి వస్తాం. ఏమిటలా చూస్తారు. ఏమిటా వాసనతాగివచ్చారా ఫ్రెండు లాక్కెళ్ళాడాబారుకి. మీర సలుమనుషులుకాదా. ఆకలికి పిల్లాడు గగ్గోలు పెట్టి ఏడుస్తూ వుంటే బారుకెళ్ళి పీకలదాకా తాగి తిని వచ్చారా. మీరసలు ఓ తండ్రేనా. పిల్లాడు కడుపుకి పాలుపట్టలేని మీరు ఓ తండ్రేనా! వందరూపాయలా. ఏందుకు నాకివి? ఈ నోటు తినమంటారా మీ బాబుని దుకాణాలు కట్టేశారా. అవును రాత్రి పదిగంటలకి తమరు సావకాశంగా తాగి, తిని వెడితే దుకాణాలు తెరుచుకు కూర్చోడానికి వాళ్ళకి భార్యా బిడ్డలున్నారన్న జ్ఞానం వుంది. వెళ్ళండి. ఈ వందా కూడా పట్టికెళ్ళి మరి నాలుగు పెగ్గులు తాగిరండి.

''అయ్యో భగవంతుడా నేనేం పాపం చేశానని నాకిలాంటి బాధలు తండ్రీ! నేనేం చీరలు అడిగానా, నగలడిగానా, సినిమాలడిగానా, సరదాలడిగానా! కన్నబిడ్డకి గుక్కెడు పాలు కావాలన్నాను. ఒరేబాబూ ఒరే నాయనాకన్నతల్లిని నీకు గుక్కెడు పాలుకూడా పట్టలేని దౌర్భాగ్యురాలినిరా తండ్రీ. యీ అమ్మకన్నీళ్ళతోకడు పునింపడం కంటె ఏం చెయ్యగలదురా. అయ్యో ఏమండి బాబేమిటంటీ యీలా అయిపోతున్నాడు. అదేమిటండీ అలా పిచ్చిచూపులు చూస్తున్నాడు.

అయ్యో, అయ్యో.. బాబు వెక్కిళ్ళు పడ్తున్నాడండీ.. అలా చూస్తారేమిటండీ! పరిగెత్తండి, డాక్టరుని తీసుకురండి. అయ్యో.. అయ్యో... బాబుగుండెలెగసిపడుతున్నాయిఅండీ. అదేమిటి ఒక్కసారి వెక్కిళ్ళు ఆగిపోయాయి. గుండెఎగసి పడ్డం ఆగిపోయింది. అదెందుకుమధ్యలో అలా వచ్చిందో. బాబూ, నాన్న ఎలావుందిరానాయనా, నిద్రపట్టినట్లుంది వెర్రినాన్నకి. అదేమిటిఏడుస్తారెందుకు వాడు ఆకలికి ఏడ్చినప్పుడు మీరూరుకున్నారు. వాడు అకలిమరిచి నిద్రపోతుంటే ఏడుపెందుకండీ. ఏదో కన్నకడుపు. బాధకొద్దీ తిట్టాను మిమ్మలి అయ్యో, అత్తయ్యా మావయ్యా మీరంతా ఎందుకుఏడుస్తున్నారెందుకు. ఏడుస్తున్న పిల్లాడని, ఉద్యోగంసద్యోగం లేని కొడుకుపిల్లాడని, ఆకలికేడుస్తున్నా చీమ కుట్టినట్లనిపించని మీరు వాడుహాయిగా నిద్రపోతుంటే యిప్పుడొచ్చి ఏడవడం ఎందుకు.

అయ్యో.. అదేమిటి వాడినలాకిందపడుకోబెడ్తున్నారు. ఏమిటి బాబింక లేడా. వెళ్ళండవతలికి నాకేంచెప్పక్కరలేదుమీరు. ఆకలికిఏడ్చి ఏడ్చి యిప్పుడే పడుకున్నాడు. నాకు పిచ్చా. బాబింక ఆకలి అని అసలుఏడవడా. బాబింక పాలుకావాలని అడగనేఅడగడా. ఏమిటీ బాబు చచ్చిపోయాడా. అబద్ధం, బాబూ, నాయనా, ఒక్కసారి కళ్ళిప్పరా''.

''యిదిగోచూడు మీనాన్న వందరూపాయలు తెచ్చారురా. చక్కారేపొద్దుట పాలడబ్బాతెచ్చి పాలుకలిపిపడతా, కడుపునిండాతాగుదువుగాని. ఏమిటి కళ్ళిప్పవూ.. యింక నీకు పాలొద్దా. ఈ పాపిష్టిడబ్బుతో పాలుతాగవూ. పోనీలేనాన్న నారక్తం పాలగామార్చిస్తానుతాగుదువుగాని.. అయ్యో వదలండినన్ను... అయ్యో... ఎందుకలా తీసికెడుతున్నారుబాబుని, ఎక్కడికి తీసికెడ్తున్నారు నాబాబుని వద్దు. నేనీయను. మీరంతాపొండి, మీరసలుమనుష్యులుకారు. రాక్షసులు. నాబాబు ఆకలికి ఏడుస్తుంటే గుక్కెడుపాలు తెచ్చీయ లేకపోయారు. వదలండినన్ను...నన్ను ముట్టుకోకండిఎవరూ.. నాకుపిచ్చా... అవును పిచ్చే. నాబాబుని నన్ను వదిలిపొంది. అయ్యో... బాబూ, నాయనా, బాబూ....

(స్వాతి వీక్లీ - 1985)